

కంచిలి : అర్జునాపురం రహదారిపై నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు



జి.సిగడాం : నాగులవలసలో నీట మునిగిన వరి పంటను చూపిస్తున్న రైతులు

కోటబొమ్మాళి : శ్రీపురంలో నీట మునిగిన కూరగాయల పంటలు

తుఫాన్ ప్రభావం.. తీరని నష్టం

- జిల్లాలో 'మొంథా' నష్టం.. రూ.1.24 కోట్లు
- అధికారుల ప్రాథమిక అంచనా
- 2,230 హెక్టార్లలో నీట మునిగిన పంటలు
- పది మండలాల్లోని 53 గ్రామాల్లో ప్రభావం
- విద్యుత్ శాఖకు రూ.11 లక్షలకుపైగా లాస్

శ్రీకాకుళం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మూడురోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఈదురుగాలుల ప్రభావానికి ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలాగే రహదారులపై వరదనీటి ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికీ బాహుదా, నాగావళి నదులు ఉధృతంగానే ప్రవహిస్తున్నాయి. బుధవారం నాటికి తుఫాన్ విలయం ముగిసింది. మొత్తంగా జిల్లాకు మొంథా తుఫాన్ ముప్పుతో రూ.1.24 కోట్ల నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పది మండలాల్లోని 53 గ్రామాల్లో తుఫాన్ తీవ్ర ప్రభావం చూపింది. అయితే ఎటువంటి ప్రాణనష్టం **(మిగతా 6వ పేజీలో..)**

వరద నీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

కంచిలి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలంలోని అర్జునాపురం వద్ద బుధవారం రహదారిపై నిలిచిన వరదనీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. ఆదివారం సంత మీదుగా వయా కేశరిపడ నుంచి కేబీ నౌగాం వెళ్లే ఈ బస్సు అర్జునాపురం వద్ద నీటి ఉధృతికి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులను కండక్టర్, డ్రైవర్ కిందకు దింపేశారు. గ్రామస్థుల సహకారంతో బస్సును ట్రాక్టర్‌కు కట్టి ముందుకు లాగారు. వరదనీటి నుంచి బయటపడిన తర్వాత బస్సులో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. వరద నీటికి రోడ్లు పూర్తిగా కోతకు గురికావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఇచ్ఛాపురం: బెల్లుపడలో జలదిగ్బంధంలో ఇళ్లు

జల దిగ్బంధం

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా కాలువలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నీటి ఉధృతికి పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లాలో వర్షాలతోపాటు ఒడిశాలో బగలెట్టి డ్యాం గేట్లు ఎత్తివేయడంతో ఇచ్ఛాపురంలో బాహుదా నదికి భారీ వరదనీరు చేరింది. నది మధ్యలో ఉన్న శివుడి విగ్రహం పూర్తిగా నీట మునిగింది. అలాగే బెల్లుపడలోని మాలబట్టిలోకి భారీ వరదనీరు చేరడంతో నివాస గృహాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇచ్ఛాపురంలోని ముంపు ప్రాంతాలను ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ బుధవారం పరిశీలించారు. బాహుదానదిలో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించి.. అధికా రులకు పలు సూచనలు చేశారు. జగన్నాథపురం, ఇన్నేసుపేటలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు.



వజ్రపుకొత్తూరు : శివరాంపురం రహదారిపై వరదనీటిలో చిక్కుకున్న ట్రాక్టర్



ఎల్.ఎన్.పేట: కడపలగెడ్డ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వర్షపు నీరు

కొట్టుకుపోయిన కల్వర్టులు..

సోంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సోంపేట మండలం పలాసపురం సమీపంలో తాత్కాలిక రహదారిపై ఉన్న కల్వర్టు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కంచిలి మండలంలోని డీజీ పురం సమీపంలో కల్వర్టుకు గండి పడడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు.



సోంపేట: పలాసపురం సమీపంలో కొట్టుకుపోయిన కల్వర్టు



కంచిలి : డీజీపురం సమీపంలో కల్వర్టుకు గండి

కోతకు గురైన రహదారులు

లావేరు/ నందిగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెద్దగెడ్డ వద్ద వరదనీరు పొంగి ప్రవహించడంతో లావేరు మండలంలో అదపాక-గుర్రాలపాలెం రహదారి కోతకు గురైంది. అధికారులు స్పందించి కంకరతో తాత్కాలికంగా రహదారి మరమ్మతులు చేపట్టారు. మదుములకు అడ్డంగా ఉన్న తుప్పలను తొలగించారు. అలాగే నందిగాం మండలం కల్లాడ, దిమ్మిడిజోల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి బుధవారం కోతకు గురైంది. దీంతో దిమ్మిడిజోల, దీనబంధుపురం, సవరకొత్తూరు, తమలాపురం, సవరరాంపురం, బెనియాపూరు, తూముకొండ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల ప్రత్యేకాధికారి ఐవీ రమణ, ఎంపీడీవో కుమార్ పట్నాయక్ కోతకు గురైన రహదారిని పరిశీలించి పూడ్చే పనులు చేపట్టారు. దిమ్మిడిజోలకి చెందిన టీడీపీ నాయకుడు సలాన కృష్ణారావు.. ట్రాక్టర్లు ద్వారా మట్టి, రాళ్లను తెప్పించి కోతకు గురైన రహదారిని పూడ్చారు.



లావేరు: కోతకు గురైన అదపాక- గుర్రాలపాలెం రహదారి



నందిగాం: కోతకు గురైన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు



పొందూరు : లైదాం బ్రిడ్జిపైనుంచి ప్రవహిస్తున్న రెల్లిగెడ్డ వరదనీరు

రాకపోకలకు అంతరాయం..

ఎల్.ఎన్.పేట/ వజ్రపుకొత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట, దబ్బపాడు గ్రామాలమధ్య కడపలగెడ్డ రోడ్డుపై నుంచి భారీగా వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయంలో వైద్యం కోసం ఎల్.ఎన్.పేట జంక్షన్‌కు వెళ్లాలంటే వాడవలస, మిరియాపల్లి మీదుగా నాలుగైదు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని దబ్బపాడు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మాణ పనులు ఏప్రిల్‌లో ప్రారంభించగా.. సగంలో నిలిచిపోయాయి. దీంతో వర్షం పడినప్పుడు తమ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయని వారు వాపోతున్నారు.

● వజ్రపుకొత్తూరు మండలం శివరాంపురంలో రహదారి జలమయం కావడంతో ప్రజలు ట్రాక్టర్ సహాయంతో రాకపోకలు సాగించారు. ఒక దశలో ట్రాక్టర్ కూడా వరదనీటిలో చిక్కుకుపోవడంతో అవస్థలు పడ్డారు. అలాగే పూండిగల్లీ వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డుపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మార్కెట్‌కు ఇతర అవరసరాలకు బయటకు వెళ్లే ప్రజలు చుట్టుతిరిగి అక్కుపల్లి, పల్లిసారథి మీదుగా రాకపోకలు సాగించారు. నువ్వలరేవు చుట్టు ఉన్న ఉప్పుటేరులో వరదనీరు చేరింది. గ్రామంలోకి నీరు రాకుండా స్థానికులు చర్యలు చేపడుతున్నారు.

ఎస్పీఆర్ పురంలో చెరువుకు గండి..

జి.సిగడాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం ఎస్పీఆర్ పురం గ్రామంలో వేపచెట్టు చెరువుకి గండి పడింది. చెరువులో నీరు ఒక్క సారిగా గ్రామంలోకి ప్రవేశించడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. మండల ప్రత్యేకా ధికారి జీవన్‌కుమార్, ఎంపీడీవో జి.రామకృష్ణ గండికొట్టిన ప్రదేశాన్ని పరిశీలించారు. గండిని పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. అలాగే మర్రివలసలో పొట్టిగాని చెరువుకి పాక్షికంగా గండి కొట్టింది. రైతులు ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు.



జి.సిగడాం: ఎస్పీఆర్‌పురంలో చెరువుకు గండి పడడంతో రహదారిపై ప్రవహిస్తున్న నీరు



బాహుదా వంతెనను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



ఇచ్ఛాపురం : బాహుదా నదిలో తగ్గని నీటి ప్రవాహం

ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ 'తుది విడత' షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్-2025 బైపీసీ స్ట్రీమ్‌లో రాసిన విద్యార్థులు బీ-ఫార్మసీ, ఫార్మా-డీ కోర్సుల్లో చేరేందుకు తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం), సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాయణరావు తెలిపారు. 'నవంబరు 1 నుంచి 4 వరకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. 3 నుంచి 5 వరకు ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన, కళాశాల, కోర్సు ఎంపికకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. 6న వెబ్‌ఆప్షన్ల నమోదులో మార్పులు చేసుకోవచ్చు. 7న సీట్ల కేటాయిస్తాం. 8నుంచి 11వ తేదీలోగా సీటు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాల'ని నారాయణరావు తెలిపారు.

పలాసలో దొంగల హల్‌చల్

- మూడు మెడికల్ షాపుల్లో చోరీ
- ఒక ఇంటర్‌నెట్ కేంద్రంలో కూడా..
- రూ.4.11 లక్షలు అపహరణ

8లో

ఎంపీసీ, బైపీసీకి ఐదేసి పేపర్లే

- ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షా విధానంలో మార్పులు
- ఈ ఏడాది నుంచే అమలు



నరసన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది నుంచి పరీక్షల నిర్వహణలో సమూలమార్పులకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. నూతన సిలబస్ మేరకు పరీక్షల నిర్వహణకు ఇటీవల షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఆరు పేపర్లు స్థానంలో ఐదు పేపర్లకు పరీక్షలు నిర్వహించనున్నారు.

● ఎంపీసీ విద్యార్థులకు ఐదు పేపర్లకు మొత్తం 500 మార్కులు కాగా 470 మార్కులకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. గతంలో గణితం పేపర్-1, 2కు 75 మార్కులు చొప్పున ఉండేవి. కానీ ఈ ఏడాది నుంచి రెండు పేపర్లను కలిపి ఒకే పరీక్షగా 100 మార్కులకు నిర్వహిస్తారు. పాస్ మార్కులు 35. అలాగే ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85 మార్కులకు, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజస్‌కు వంద మార్కులు చొప్పున రెండు పరీక్ష పత్రాలు ఇస్తారు.

● బైపీసీలో మార్కులు మొత్తం 500కాగా, 455 మార్కులకు రాత పరీక్ష నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ -15, ఫిజిక్స్-15, బయాలజీ -15) 45 మార్కులు. గతంలో బోటనీ, జువాలజీ 60 మార్కులకు చొప్పున రెండు పేపర్లు ఉండేవి. ప్రస్తుతం ఈ రెండు కలిపి 85 మార్కులుగా ఒకే ప్రశ్నాపత్రంగా ఇస్తారు. ఆన్సర్ షీట్‌లు మాత్రం రెండుగా ఉంటాయి. బోటనీ 43 మార్కులు, జువాలనీ 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత 29 మార్కులుగా నిర్ధారించారు. ఫిజిక్స్ 85కి, కెమిస్ట్రీ 85 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వేజెస్‌కు వంద మార్కుల చొప్పున పరీక్ష పత్రాలు ఇస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ విధానం అమలు చేస్తారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రం పాతవిధానంలోనే ప్రశ్నపత్రాలు ఉంటాయి.

● జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, మోడల్‌స్కూల్‌లో ఇంటర్ తరగతులు నిర్వహించేవి -13, కేజీబీవీలు -25, సోషల్ వెల్ఫేర్ కళాశాలలు -9, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల -1, ప్లస్ -1 కళాశాలలు 6, మహాత్మజ్యోతిరావు పూలే మహిళా కళాశాల -1 , ప్రైవేటు జూనియర్ కళాశాలలు -71 ఉన్నాయి. ఆయా కళాశాల్లో సుమారు 24వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు కొత్త ప్రశ్నపత్రాలపై అవగాహనకు ఓరియంటల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పవన్ తెలిపారు.

ప్రమాదమని తెలిసినా..

- చేపలవేటకు వెళ్లి గిరిజనుడి గల్లంతు
- కంబిరిగాం వరహాలు గెడ్డలో ఘటన
- గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బలగాలు

పలాస/పలాస రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పలాస మండలం దానగొర గ్రామానికి చెందిన సవర లావణ్య(38) అనే గిరిజనుడు బుధవారం చేపలవేటకు వెళ్లి వరద ఉధృతికి నీటిలో కొట్టుకెళ్లిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంబిరిగాం రహదారిలో వరహాలగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాశీబుగ్గ పోలీసులు ఆ ప్రాంతంలో ఎవరూ వెళ్లకుండా పహారా పెట్టారు. అటువైపు ఎవరూ వెళ్లొద్దని ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. కాగా.. బుధవారం ఉదయం వరహాలుగెడ్డలో చేపలు పట్టేందుకు దానగొర గ్రామానికి చెందిన ఐదు మంది యువకులు వలలు, కర్రలు పట్టుకొని కంబిరిగాం ప్రాంతానికి వచ్చారు. రోడ్డుకు సమీపంలో ఉన్న సరప్లస్ వీయర్ (పరుపు) వద్దకు అతికష్టంపై సవర లావణ్య బృందం వెళ్లి వేట సాగించింది. ఈ క్రమంలో పెద్ద చేప ఒకటి వెళ్లిపోతుండడాన్ని గుర్తించి దాన్ని పట్టుకునే క్రమంలో పట్టుతప్పి వరదలో పడిపోయాడు. దీంతో ఉధృతికి లావణ్య కొట్టుకుపోయాడని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య అన్నమ్మ, కుమారుడు సంజీత్, కుమార్తె రక్షిత ఉన్నారు. లావణ్య ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇంటి యాజమాని గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, డీటీ వి.గిరి, ఎస్ఐ నర్సింహమూర్తి పరిశీలించారు. ఇన్‌చార్జి కలెక్టర్‌కు సమాచారం అందజేశారు. ఆ ప్రాంతాన్ని రెడ్‌అలర్ట్ ప్రకటించారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకుని లావణ్య కోసం గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.



లావణ్య (ఫైల్)



లావణ్య కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

ఎటు చూసినా నీరే

- మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులు
- మునిగిన పంటలు

మొంథా తుఫాన్ తాకిడికి అన్నదాత కుదేలయ్యాడు. మరికొద్ది రోజుల్లో చేతికి అంది వస్తుందనుకున్న వరి పంట నీట మునిగింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెరువులు ఎక్కడ ఉన్నాయో.. పొలాలు ఏవో గుర్తు పట్టడం కష్టమంటే అతిశయోక్తి కాదు. అనేక చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గెడ్డలు పొంగి.. పొలాల మీద పడ్డాయి. నీట మునిగిన పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. -ఆంధ్రజ్యోతి బృందం


పలాస: మొగిలిపాడు-గొప్పిలి రోడ్డు వరదతో కోతకు గురవుతున్న దృశ్యం


పలాస: శాసనం-రాజగోపాలపురం రోడ్డులో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు..


నరసన్నపేట: చిన్నదూగాం వద్ద పొలంలోని వరద నీటిని మళ్లిస్తున్న రైతులు


గార: వాడాడలో నీట మునిగిన వరి


కళింగపట్నంలో ఇళ్ల చుట్టూ వర్షపునీరు


కవిటి: కె.కొజ్జిరియా వద్ద నీట మునిగిన పొలాలు..


ఇచ్ఛాపురం: తులసిగాంలో నీట మునిగిన పొలాలు


నందిగాం: నారాయణపురంలో నేలకొరిగిన చేనును నిలబెడుతున్న రైతు


హిరమండలం: కిట్టాలపాడు గ్రామంలో నీటమునిగిన వరిపంటను చూపిస్తున్న రైతు


సరుబుజ్జిలి: బూర్జ మండలం చీడివలసలో రైతు దిగాలు


పాతపట్నం రూరల్: నేలకొరిగిన పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న రైతులు


వజ్రపుకొత్తూరు: పొలాల్లో నిలిచిన వరద నీరు


జి.సిగడాం: మర్రివలసలో నీట మునిగిన పంట


టెక్కలి: గోపీనాథపురం ప్రాంతంలో..


ఎచ్చెర్ల: రామజోగిపేట వద్ద నేలకొరిగిన వరి


ఎల్ఎన్‌పేట: యంబరాం సమీపంలో నేలకొరిగిన వరిచేలను కట్టలు కడుతున్న రైతులు


కోటబొమ్మాళి: సరియాపల్లిలో నేలకొరిగిన వరి

తుఫాన్ ప్రభావం.. తీరని నష్టం

(ఐదో పేజీ తరువాయి)

సంభవించకపోవడం ఉపశమనం లభించినట్లయింది. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించారు. ముంపు, తీర ప్రాంతాల్లో ప్రజలను ముప్పై శిబిరాల్లోకి తరలించారు. 832 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణనష్టం సంభవించకుండా కాపాడగలిగారు.

● 2,230 హెక్టార్లలో పంటలకు నష్టం..

తుఫాన్ ప్రభావంతో జిల్లాలో 2,230.29 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. 4,801 మంది రైతులు నష్టపోయారు. ఇచ్ఛాపురం మండలంలో అత్యధికంగా 1,118 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైంది. పాతపట్నంలో 168 హెక్టార్లు, నందిగాంలో 150 హెక్టార్లు, ఎచ్చెర్లలో 6 హెక్టార్లు, వజ్రపుకొత్తూరులో 213 హెక్టార్లకు నష్టం వాటిల్లింది. వరిపంట కోత దశతో తుఫాన్ తమకు తీరని నష్టాన్ని మిగిల్చిందని రైతులు వాపోతున్నారు. ఉద్యాన పంటల విషయానికొస్తే.. మొత్తం 11.39 హెక్టార్లలోని జీడిమామిడి, 0.40 హెక్టార్లలో బొప్పాయి, 0.45 హెక్టార్లలో అరటి, 2 హెక్టార్లలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. మందస, వజ్రపుకొత్తూరు, పలాస, కవిటి, కంచిలి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం ఏర్పడింది. 278 కొబ్బరి మొక్కలు నేలకూలి దెబ్బతిన్నాయి.


రణస్థలం : మెంటాడ పాదాల చెరువు పొంగి ప్రవహించడంతో నీట మునిగిన ఇళ్లు


కళింగపట్నంలో వైద్యశిబిరం

● విద్యుత్ శాఖకు రూ.11.73 లక్షలు

జిల్లాలో విద్యుత్ శాఖకు రూ.11.73 లక్షలు నష్టం సంభవించింది. మొత్తం 11 కేవీ స్తంభాలు 36, ఎల్టీ స్తంభాలు 53 నేలకూలాయి. 27 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తక్షణ మరమ్మతులు చేపట్టారు.

● రోడ్లు.. ఇళ్లు.. పశు నష్టం..

ఆర్అండ్‌బీ శాఖకు చెందిన 16.38 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. దీనివల్ల రూ.90 లక్షలు ఆస్తి నష్టం సంభవించింది. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రోడ్ల పాడై.. రూ. 15లక్షల మేర నష్టం వాటిల్లింది. తుఫాన్ ధాటికి 44 ఇళ్ల దెబ్బతిన్నాయి. వీటిలో ఏడు ఇళ్ల పూర్తిగా ధ్వంసం కాగా.. 34 ఇళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళ్ల నష్టం అంచనా రూ. 7.06 లక్షలుగా ఉంది. జిల్లాలో మూగజీవులు మృతిచెందాయి. పాడి రైతులకు రూ. 1.1 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తీసుకునే చర్యలు.. ఇవ్వనున్న పరిహారంపై ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఆఖరి మజిలీలోనూ కష్టమే

- శ్మశానికి దారిలేక అవస్థలు


పంట పొలాల్లో నుంచి మృతదేహాన్ని తీసుకు వెళుతున్న దృశ్యం

లావేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల శివారులోని కొండకుంకాం గ్రామ శ్మశాన వాటికకు రహదారి సదుపాయం లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మృతి చెందితే పంట పొలాల మధ్యలో నుంచి తీసుకెళ్లాల్సి వస్తోంది. బుధవారం ఈ గ్రామానికి చెందిన దేవర పాపయ్య (75) మృతిచెందాడు. అతని మృతదేహాన్ని పచ్చని పంట పొలాల మీదుగా...మోకాలి లోతు నీటిలో అష్టకష్టాలు పడదుతూ స్వర్గధామానికి చేర్చాల్సి వచ్చింది. ఈ గ్రామంలో సుమారు 1200 వరకు జనాభా ఉన్నారు. ఇక్కడ ఎవరైనా చనిపోతే ఇలానే ఇబ్బందులు పడుతూ స్వర్గధామానికి చేర్చాల్సిన దుస్థితి ఎదురవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి.. తమ గ్రామంలోని శ్మశానికి వెళ్లేందుకు రహదారి సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

వర్షాల వేళ.. పంటలు జాగ్రత్త

- వ్యవసాయ అధికారుల సూచనలతో మేలు


నేలకొరిగిన వరి పనలను చూపుతున్న రైతు

నరసన్నపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ కారణంలో జిల్లా అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వ్యవసాయ పంటలు పాడై రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టాలను తగ్గించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఈ ఏడాది వరి పంట 3.69 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పంట పూతదశ, పాలు పోసుకునే దశ, గింజపట్టే దశ, కోత దశలలో ఉంది. అలాగే మొక్కజొన్న 25 వేల ఎకరాలు, ప్రత్తి 4,500 ఎకరాల్లో సాగులో ఉంది. ఈ పంటలను తగిన జాగ్రత్తలు పాటిస్తే కొంత వరకు రక్షణ పొందవచ్చునని వ్యసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వరిలో ఇలా..

వరిలో ఎంటీయూ 1061, 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, బీపీటీ 5204 మొదలైన రకాలు పూతదశలో ఉన్నాయి. పూత దశలో వర్షాలు కురిసినప్పుడు సంపర్కం జరగకపోవడం వల్ల తాలు (కవ్వ) గింజలు ఏర్పడతాయి. అదేవిధంగా ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, ఎంటీయూ 1124 వంటి రకాలలో గొలుసుకట్టు దగ్గరగా ఉండటం వల్ల గింజరంగు మార డం, మానిపండు తెగులు వచ్చే అవకాశం ఉంది. నిరంతరం వర్షాల వల్ల మొలకవచ్చే అవకాశం ఉంది. బ్యాక్టీరియా ఎండాకు తెగులు, మాగుడు తెగులు వ్యాపించే ప్రమాదం ఉంది. బీపీటీ 5204 పీఎల్‌పి 1100 వంటి నిద్రావస్థలేని రకాల్లో గింజలు వెంటనే మొలకెత్తే అవకాశం ఉంది.

ఏం చేయాలంటే..

- పాలు పోసుకునే దశలో ఉన్న స్వర్ణ, సంపద స్వర్ణ, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం 1638 వర్షాలకు, ఈదురు గాలులకు పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. చిన్న కాలువల ద్వారా నీటిని తొలగించాలి. ఎక్కువగా నీరు నిలిచిన చోట పెద్దకాలువలు చేసి మోటార్ల ద్వారా నీటిని తొలగించాలి. గింజలు రంగు మారడం, మాగుడు తెగులు, మానిపండు తెగులు వ్యాప్తి నివారించడానికి ఎకరాకు 200 మి.లీ. ప్రొపికోనాజోల్ పిచికారీ చేయాలి.
- గింజ గట్టిపడే దశలో ఉన్న పంట అధిక వర్షాలకు దెబ్బతింటే.. పొలంలో నీరు అంతర్గత కాలువల ద్వారా తొలగించాలి. నిలిచిన లేదా పడిపోయిన పంటలో కంకిలో మొలకలు కనపడితే 5శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాములు స్ఫటిక ఉప్పు లీటరు నీటికి) కలిపి పిచికారీ చేయాలి. ఇది మొలకల రంగు మార్పును తగ్గిస్తుంది.

కోత సమయంలో చేను పడిపోతే..

గింజ తోడుకొని లేదా గట్టిపడే దశలో లేదా కోత దశలో అకాల వర్షాలకు మొక్కపడిపోయి నేలకు ఒరిగే అవకాశం ఉంది. దీనితో పాటు పడిపోయిన చేల రక్షణకు నీటిని తొలగించి, గింజలు మొలకెత్తకుండా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారీ చేయాలి. నిద్రావస్థ లేని సాంబమసూరి వంటి రకాలు, నిద్రావస్థ ఉన్న రకాలలో వారం రోజుల పాటు చేను పడిపోయి నీట మునిగినప్పుడు మొలక వచ్చి నష్టం ఎక్కువగా ఉంటుంది. దీనిని నివారించడానికి చేనుకు సమతుల్యంగా ఉండేందుకు వ్యవసాయ అధికారులు సూచనల మేరకు ఎరువులను వేయాల్సి ఉంటుంది.

పత్తి పంటలో..

ప్రస్తుతం పత్తిపంట కాయ పగిలే దశ నుంచి కోతకు చేరుకునే దగ్గరలో ఉంది. ఈ సమయంలో వర్షాలకు కుళ్ల తెగులు ఆశిస్తుంది. అలాగే కాయ కుళ్ల కూడా వస్తుంది. దీనివల్ల పత్తి రంగు మారడం, పాడవడం జరుగుతుంది. దీని నివారణకు వర్షాలు తగ్గిన తరువాత మురుగునీరు తొలగించాలి. పైపాటుగా 2శాతం యూరియా లేదా 2 శాతం పోటాషియం నైట్రేట్, ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్ లీటరు నీటికి కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేయాలి. గాలిలో తేమ ఎక్కువగా ఉండడం వల్ల తెగుళ్ల వ్యాప్తికి అవకాశం ఉంటుంది కాబట్టి ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 3గ్రా మాంకోజెబ్ లేక కాపర్ అక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి. తెగులు సోకిన పొలంలో లీటరు నీటికి ఒక మి.లీ. ప్రొపికోనజోల్ లేకా కాప్టాను ప్లస్ 1 గ్రా హెక్సా కొనజోల్‌తో కలిపి 15 రోజుల వ్యవధిలో చల్లుకోవాలి.

మొక్కజొన్నలో..

సాధారణంగా అకాల వర్షాల వల్ల పంటకు తీవ్రమైన నష్టం కలుగుతుంది. ప్రస్తుతం జిల్లాలో చాలా వరకు కోతలు పూర్తయ్యాయి. కొంత మేరకు కోయడానికి సిద్ధంగా ఉంది. కోత దశలో ఉన్న పైరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వర్షాలు తగ్గిన వెంటనే కోత చేపట్టాలి.
- తడిసిన కండెలను గచ్చుపై పలుచగా పేర్చి ఎండలో బాగా అరబెట్టి సాధ్యమైనంత త్వరంగా నూర్పిడి చేయాలి. కోత దశలో ఉన్న పంట నేలకు ఒరిగితే పొలంలోనే నీటిని బయటకు తీసివేసి చేనుపైన ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కోత తరువాత కల్లంపైన అరబెట్టిన మొక్కజొన్న కండెలు తడిస్తే.. బాగా నీడలో ఆరబెట్టాలి, అవసరాన్ని బట్టి పలుచగా 5శాతం మెత్తటి ఉప్పును తడిచిన కండెలు పైన పలుచగా చల్లి బాగా కలపడం వల్ల మొలక రాకుండా నివారించవచ్చు.


గార: బందరువానిపేటలో మత్స్యకారులకు విపత్తులపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, ఎన్డీఆర్ఎఫ్ బృందం


బందరువానిపేటలో రేషన్ సరుకులు పంపిణీ



గార మండలం శిలగాంలో కర్పూరేశ్వర స్వామి ఆలయంలోకి ప్రవేశించిన వరద నీరు


వేట లేక బందరువానిపేటలో నిరీక్షిస్తున్న మత్స్యకారులు

ఎవరూ అధైర్య పడొద్దు: రవికుమార్


పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభా వంతో వివిధ రూపాల్లో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని, అధైర్య పడవద్దని ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బుధవారం సరుబుజ్జిలి జడ్పీ ఉన్నత పాఠశాలలో పునరావాసం పొందుతున్న శ్రీరాంవలస బాధిత 18ఎరుకుల కుటుంబాలకు సాయం అందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూరి గుడిసెల్లో నివసిస్తున్న వారిని తహసీల్దార్ మధుసూదనరావు గుర్తిం చి వారికి పునరావాసం కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభు త్వం తుఫాన్ బాధితులకు మంజూరు చేసిన రూ.3 వేలు వంతున నగదుతో పాటు నిత్యావసర సరుకులు ఆయన అందించారు. అనంతరం ఎమ్మెల్యే సరుబుజ్జిలి, శరభాపురం, తురకపేట రెవెన్యూ గ్రామాల్లో వరి పంటలను అధికారులతో కలిసి పరిశీలించారు. నష్టాలను నివేదిక రూపొందించి జిల్లా అధికా రులతో పాటు తనకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, ఏవో మన థరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు దవళ సింహాచలం, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇల్లాకుల ప్రభాకర్, కొమనాపల్లి రవికుమార్, కొర్ను సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కూన రవికుమార్ బూర్జ మండలంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోనూ పర్యటించారు. పంట నష్టం వాటిల్లిన రైతులకు ధైర్యం చెప్పారు. ఏ ఒక్క బాధితుడికి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు తదితరులున్నారు.

తుఫాన్ అనంతర చర్యలు తీసుకోండి: అశోక్


అధికారులతో మాట్లాడుతున్న విప్ బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రభుత్వం ఆదేశించిందని విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరిగిందో నివేదిక అందజేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. నష్టపోయిన పంటలను అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు, మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్. వెంకటరావు, ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావిత మత్స్యకార గ్రామమైన డొంకూరు గ్రామాన్ని బుధవారం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సందర్శించారు. కాజ్‌వే పై నిలిచిలోనుంచి నడుచుకుంటూ వెళ్లి గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. జగన్నాథపురం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నమనాయుడు, టీడీపీ నేతలు పి.తవిటయ్య, ఎన్.కోటి, ఎస్.డిల్లీ, కాళ్ల దిలీప్, ఎన్.జాని తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

రణస్థలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మెంటాడ పంచాయతీ పరిధిలోని పాదాల చెరువు పొంగింది. దీంతో చెరువుకు సమీపంలో ఉన్న 12 పూరిళ్లు నీట మునిగాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు బుధవారం బాధితులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధితులకు పునరావాస కేంద్రానికి తరలించారు. ఈదురు గాలులకు బీసీ బాలుర వసతి గృహం వద్ద చెట్టు నేలకొరిగింది, తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, ఎస్ఐ ఎస్.చిరంజీవి, వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టాలను పరిశీలించారు.


మెంటాడ తీరాన్ని పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

దుర్గంధం.. ఆర్టీసీ కాంప్లెక్స్

● పొంగిన పద్మాపురం గెడ్డ

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొం థా తుఫాన్ నేపథ్యంలో ఆంధ్ర, ఒడిశాలో కురి సిన భారీ వర్షాలకు పద్మాపురం గెడ్డకు భారీగా వరదనీరు చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఈ సమీపంలో ఉన్న తులసిగాం, ధర్మపురం గ్రామాల్లోని పంట పొలాల్లో నీరు చేరింది. మండలంలో నీటి ముంపునకు గురైన పంట పొలాలను వ్యవసాయాధికారి అజయ్ పరిశీలిం చారు. రెండు రోజుల్లో పొలాల నుంచి నీరు వెళ్లిపోతే పంటకు ఎటువంటి నష్టం వాటిల్ల దని పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు నిలిచిన నీరు మురికిగా తయారై దుర్గంధంతో ముక్కుమూసు కోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో నీటమునిగిన పంట పొలాలను వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. ఏడీఏ భవానీ శంకర్, కేవీకే కోఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్త ఉదయభాను రైతులతో మాట్లాడి సూచనలిచ్చారు.


ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ చుట్టూ చేరిన మురుగునీరు

పొంగుతున్న రెల్లి గెడ్డ

జి.సిగడాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జి.సిగడాం మండలం టీడీవలస, విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మండాకురిటి గ్రామాల మధ్య ఉన్న రెల్లిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రెండు మండలాల ప్రజలు రాకపోక లకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నీరు రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మర్రివలస గ్రామంలో చెరువు గట్టుకు పాక్షికంగా గండిపడింది.


టీడీవలస-మండాకురిటి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న రెల్లి గెడ్డ

లైదాం బ్రిడ్జిపై నిలిచిన రాకపోకలు

పొందూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రెల్లిగెడ్డలో వరదనీరు లైదాం బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహి స్తోంది. బ్రిడ్జిపై 3 అడుగులమేర వరదనీరు ప్రవహించడంతో పొందూరు, సంతకవిటి మండలాల్లో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రెల్లిగెడ్డ పరిధిలో పంటపొలాల్లో వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలుల తీవ్రతకు మండలంలో 23 విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. జోగన్నపేటలో ప్రధాన విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోకి సుబ్బయ్య చెరువు నుంచి నీరు చేరింది. పొందూరు నుంచి కాలనీకి వెళ్లే దారిలో గెడ్డ ఉధృతంగా ప్రవ హించడంతో కాలనీ వాసు లు రాకపోకలు ఇబ్బందులు పడ్డారు. తోలాపి ఎస్సీ కాలనీలో భారీగా వరదనీరు నిలిచి పోవ డంతో కాలనీవాసులు కష్టాలు పడ్డారు.


పొందూరు: తోలాపి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చేరిన నీరు


వీఆర్‌గూడెం వద్ద నేలకొరిగిన విద్యుత్ స్తంభం

కూలిన ఇల్లు.. రోడ్లపై నీరు

కంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలు బుధవారం తగ్గుముఖం పట్టాయి. అయితే రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాలినపుట్టుగలో మంగళవారం రాత్రి సాలిన డిల్లీరావుకు చెందిన ఇంటి గోడ కూలింది. ఈ సమయంలో ఇంటిలో డిల్లీరావు తోపాటు అతడి భార్య శేషమ్మ, కుమారుడు సాగర్, 8 నెల ల గర్భిణీ అయిన కుమార్తె కాంచన నిద్రిస్తున్నారు. అయితే ఎటువంటి ప్రాణాప్రాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పద్మతుల గ్రామంలో ఉయ్యూరు దానమ్మకి చెందిన ఇంటి గోడ కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న టీడీ పీ మండల అధ్యక్షుడు మాదిన రామారావు ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. గోకర్ణపురం వద్ద పైడిగాం చానల్‌కి గండి పడటంతో దిగువన ఉన్న పొలల్లోకి నీరు చేరింది. మండలంలో తుఫాన్ తీవ్రతకు నష్టంవాటి ల్లిన ప్రాంతాలను అధికారులు బుధవారం పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి అప్పలస్వామి, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎస్ఐ పారినాయుడు, ఆర్‌అండ్‌బీ ఏఈఈ దిక్కుల విక్రమ్ డిజిపురం, నారాయణబట్టి, అర్జునాపురం, కేశరిపడ, కెబినౌగాం, పోలేరు గ్రామాల్లో పర్యటించి తెగిన రోడ్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. పంట పొలాలను పరిశీలించారు. మండల పరిధిలో సుమారు 176 కొబ్బరి చెట్లు నేలకొరిగినట్లు ఉద్యానశాఖాధికారి మాధవీ లత తెలిపారు. బాధిత రైతులతో కలిసి కొబ్బరి తోటలను పరిశీలించారు. టీడీపీ నాయకుడు తమరాల శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సాలినపుట్టుగలో కూలిన ఇంటిగోడ


కేసరిపడలో రోడ్డుపై నీటి ప్రవాహంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గెడ్డ ఉధృతితో నిలిచిన రాకపోకలు

● వరి, పత్తి, మొక్కజొన్నకు నష్టం

లావేరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వర ద నీటితో బుడుమూరు పెద్దగెడ్డ ఉధృతంగా ప్రవహించింది. దీంతో అదపాక-గుర్రాల పాలెం మధ్యలో కాజ్‌వే పైనుంచి నీటి ప్రవాహంతో గుర్రాలపాలెం, పాత కుంకాం, కొత్త కుంకాం, పైడాయ వలస, ఇజ్జుపేట, ఎల్ఎన్‌పురం, పెద కొత్తపల్లి, కందిపేట తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. వరద నీటివల్ల అదపాక పెద్దగెడ్డ వద్ద ఉన్న బీటీ రోడ్డు బీటలు వారింది. దీంతో గెడ్డ ప్రవాహం తగ్గినా సరే ఈ మార్గంలో ప్రయా ణం చేయడం కష్టతరంగా మారింది. కోతకు గురైన రహదారిని బుధవారం అధికారులు వెంటనే ఎక్స్‌కవేటర్ సాయంతో మదుములకు అడ్డంగా ఉన్న తుప్పలను తొలగించి గ్రావెల్ వేచి తాత్కాలికంగా మరమ్మతులు చేప ట్టారు. మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. వర్షాలకుగా చిగురుకొత్తపల్లిలో బావరాజు అప్పా రావు ఇంటికి ఆనుకుని ఓ చెట్టుకూలి పడిపోయింది. అయితే ఎటువంటి ప్రమాదం జర గలేదు. తహసీల్దార్ శ్రీనివాస రావు, ఎస్ఐ లక్ష్మణరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో పద్మజ వెంటనే స్పందించి చెట్టును తొలగించే చర్యలు తీసుకున్నారు.


ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దగెడ్డ


చిగురుకొత్తపల్లిలో ఇంటి ముందు కూలిన చెట్టు

న్యూస్ బాక్స్

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): కుందువానిపేటలో పేకాట అడుతున్న 11 మందిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.7,530 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో డొంకూరు గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబాలకు చెందిన మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ డిమాండ్ చేశారు. బుధవారం ముంపునకు గురైన గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాల కారణంగా ఎండ పెట్టిన సుమారు రూ.20 లక్షలు చేపలు కుళ్లిపోయి నష్టపోయారన్నారు. అలాగే నీట మునిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నర్తు నరేంద్ర, ఎంపీపీ బోర పుష్ప తదితరులు పాల్గొన్నారు.

● కంచిలి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నువాగడ గిరిజన గ్రామాల్లో ఇంటిగోడలు కూలిపోయి నష్టపోయిన బాధితులను జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా చెరో రూ.1500 చొప్పున ఆర్థిక సాయం అందించారు.

మహిళల ఆరోగ్యానికి 'సఖి సురక్ష' దోహదం

అరసవల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘ మహిళల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య సేవలు అందించేందుకు సఖి సురక్ష దోహదం చేస్తుందని మెప్మా పీడీ ఎస్. వెంకటరావు అన్నారు. బుధవారం బాపూజీ కళామందిర్, రైతు బజారు మహిళా సమఖ్య వన రుల కేంద్రంలో వేర్వేరుగా సఖి సురక్ష ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను ఆయన పరిశీలించారు. పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల్లో 35 సంవత్సరాలు పైబడిన మహిళల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి ఆరోగ్య భద్రతపై చైతన్యం చేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం 562 మందికి, బుధవారం 948 మందికి పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో జి.కిషోర్‌బాబు, వై.శారదామణి, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన మద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఎవరైనా కల్తీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం పలు ఎక్సైజ్ దుకాణాల వద్ద సురక్షా యాప్, క్యూఆర్‌కోడ్ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణదారుడు మద్యం సరుకులు డిపోలో కొనుగోలు చేసి తన షాపునకు తీసుకెళ్లే ముందు యాప్ ద్వారా స్కాన్ చేసి నాణ్యతను నిర్ధారించుకోవాలన్నారు. అలాగే ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి వినియోగ దారునికి అమ్మకాలు చేపట్టాలన్నారు. అనధికారిక మద్యం కేంద్రాలను నిర్వహిస్తే దాడులు చేసి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. మద్యం నాణ్యతపై అనుమానం ఉంటే 14405 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటివరకు 265 మందిపై కేసులు నమోదు చేశామని, ఇందులో 198 మందిని బైండోవర్ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ప్రసన్న వేంకటేశ్వరుని తిరువీధి

రణస్థలం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకృష్ణ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని బుధవారం సూర్యప్రభ వాహనంపై తిరువీధి ఉత్సవాలు నిర్వహించారు. ఎస్‌కేసీఎం గోసేవా ఆశ్రమం త్రిదండి స్వామి భక్తి సాధన కేశవ గోస్వామి మహారాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. రామతీర్థం జంక్షన్ నుంచి పాత పెట్రోల్ బంక్ వరకు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఈ తిరువీధి కన్నుల పండువగా జరిగింది. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


స్వామి వారి తిరువీధి

ఆదిత్యుని సేవలో కస్టమ్స్ కమిషనర్..

అరసవల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కస్టమ్స్ కమిషనర్ (విజయవాడ) రమేష్‌కుమార్ రామన్ బుధవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదిం చారు. అనంతరం స్వామి ప్రసాదం, జ్ఞాపికను జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి అంద జేశారు.


కస్టమ్స్ కమిషనర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

వర్షాలకు పాడైన రోడ్లు

ఎచ్చెర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల రోడ్లు పాడయ్యాయి. తోటపాలెం జంక్షన్ నుంచి చినకొంగరాం మీదుగా వెళ్లే రోడ్డు, ఓఏ అగ్రహారం మీదుగా ధర్మవరం ఆర్‌అండ్‌బీ రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ముద్దాడ ఊట గెడ్డ బ్రిడ్జి వద్ద, రామ జోగిపేట నుంచి మునియాం ట్యాంకు వరకు రోడ్డు నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.



తోటపాలెం జంక్షన్ నుంచి చినకొంగరాం, ముద్దాడ ఊటగెడ్డ వద్ద రోడ్ల దుస్థితి

2న కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లాస్థాయి బాల బాలికల జట్ల ఎంపికలను నవంబరు 2న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా అధ్యక్షుడు నక్క కృష్ణారావు, కార్యదర్శి సాధు మునలి నాయుడు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలోని శాంతి నగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వద్ద ఈ ఎంపికలు నిర్వహిస్తున్నామని, క్రీడాకారులకు 2009 డిసెంబరు ఒకటి నాటికి 16 ఏళ్లలోపు వారై ఉండాలన్నారు. బాలురు 60 కేజీలు, బాలికలు 55 కేజీలలోపు బరువు ఉండాలని, ఎంపికలు పూర్తిగా మ్యాట్ పై ఉంటుందని, క్రీడాకారులు మ్యాట్ షూ ధరించి రావాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లా మంత్రాలయంలో నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆదివారం (2న) హాజరై ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాస రావు వద్ద రిపోర్టు చేయాలని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పలాసలో దొంగల హల్‌చల్

- మూడు మెడికల్ షాపుల్లో చోరీ ● ఓ ఇంటర్‌నెట్ కేంద్రంలో కూడా..
- రూ.4.11 లక్షల అపహరణ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పలాస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలు, అధికారులు, పోలీసులంతా తుఫాన్ హడావిడిలో ఉండగా దొంగలు మాత్రం మంగళవారం అర్ధరాత్రి పలాసలో హల్‌చల్ చేసి నాలుగు షాపులను కొల్లగొట్టారు. నిత్యం రద్దీగా ఉండే శ్రీనివాస లాడ్జి జంక్షన్, పాత జాతీయ రహదారి కాశీబుగ్గ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న మొత్తం మూడు ఔషధ దుకాణాలు, ఒక ట్రావెల్ కమ్ ఇంటర్‌నెట్ సెంటర్‌లో చోరీకి పాల్పడ్డారు. మొత్తం రూ.4.11 లక్షలు చోరీ జరిగినట్టు బాధితులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసలాడ్జి జంక్షన్‌లో తంగుడు సాంబమూర్తి మెడికల్ స్టోర్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత షాపు తాళాలు విరగ్గొట్టి దొంగలు లోపలకు ప్రవేశించారు. ఏజెన్సీ నిర్వాహకుల కోసం బ్యాగులో దాచి ఉంచిన రూ.3.65 లక్షల నగదు చోరీ చేశారు. ఇదే ప్రాంతంలో ఉన్న రామకృష్ణ మెడికల్ స్టోర్‌లో కూడా దొంగలు చొరబడి రూ.40వేల దొంగిలించుకుపోయారు. పాతజాతీయ రహదారి కాశీబుగ్గ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న లక్ష్మి మెడికల్ స్టోర్స్ తాళాలు విరగ్గొట్టి విలువైన సామగ్రితోపాటు కొంత నగదు దొంగిలించారు. షాపు మేడపై ఉన్న ట్రావెల్స్ కమ్ ఇంటర్‌నెట్ సెంటరులో చొరబడి రూ.6 వేలుతో ఉడాయించారు. సంబంధిత షాపులకు సీసీ కెమెరాలు ఉన్నా వర్షాలు కారణంగా అవి మొరాయించాయి. దీంతో ఎంత మంది దొంగలు వచ్చి దొంగతనానికి పాల్పడిందీ తెలియడం లేదు. కేటీ రోడ్డు, పాత జాతీయ రహదారిపై ఉన్న నిఘా కెమెరాలు పరిశీలించాల్సి ఉందని, ఇది శ్రీకాకుళం జిల్లా పోలీసు కేంద్రంలో ఉన్న కంట్రోల్ రూములో పరిశీలిస్తామన్నారు. ఘటన స్థలానికి క్లూస్‌టీమ్ చేరుకుని ఆధారాలు సేకరించారు. నిత్యం జనం రద్దీగా ఉండే కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి జంక్షన్‌లో ఇటువంటి దొంగనం జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇదే ప్రాంతంలో రెండు నెలల కిందట ఓ మొబైల్ స్టోర్‌లో రూ.1.20 లక్షల నగదు ఇదే తరహాలో చోరీకి గురైంది. ఆ చోరీకి, ప్రస్తుతం జరిగిన దొంగతనానికి సంబంధం ఉందా? లేదా? అనేది విచారణలో తేలాల్సి ఉంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య


ఇబ్రహీం (ఫైల్)

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం రాంపురానికి చెందిన మహ్మద్ ఇబ్రహీం (21) మండలవీధిలో తాను ఉంటున్న గదిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఇదే గ్రామానికి చెందిన తన స్నేహితుడితో కలిసి మండలవీధిలో ఉన్న గ్లామర్ సెలూన్‌లో పని చేసేందుకు వచ్చాడు. ఇద్దరూ మూడు నెలల చొప్పున పనిచేసేందుకు యజమానితో ఒప్పందం చేసుకున్నారు. గత మూడు నెలలుగా ఇబ్రహీం సెలూన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని తాను ఉంటున్న గదికి వెళ్లిపోయాడు. మంగళవారం సెలూన్ షాప్ సెలవు కావడంతో ఇబ్రహీంను ఎవరూ పట్టించుకోలేదు. బుధవారం షాప్‌నకు రాకపోవడంతో యజమాని.. ఇబ్రహీం ఉంటున్న గది వద్దకు వెళ్లి ఎంత పిలిచినా రాకపోయేసరికి స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టారు. గదిలో ఇబ్రహీం ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. వెంటనే సెలూన్ యజమాని వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి అతడి బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇబ్రహీంకు ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువతితో వివాహం కుదరడంతో నిత్యం ఆమెతో మాట్లాడడం కాల్‌డేటా ద్వారా గుర్తించారు. వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ కారణంగా ఇబ్రహీం మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మహిళ మృతదేహం గుర్తింపు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డేఅండ్‌నైట్ కూడలి సమీపంలోని నాగావళి నది వంతెనపై నుంచి దున్న రాజ్యలక్ష్మి (42) ఈనెల 25న రాత్రి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెలిసిందే. దీంతో గత మూడు రోజులుగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, శ్రీకాకుళం టూటౌన్ పోలీసులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగనగళ్లవానిపేట సముద్రం ఒడ్డున గుర్తుతెలియని మహిళ మృతదేహం గుర్తించినట్టు స్థానికులు శ్రీకాకుళం రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి ఆరా తీసి నాగావళి నదిలో దూకి దున్న రాజ్యలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలుసుకొని టూటౌన్ సీఐ ఈశ్వరరావుకు సమాచారమిచ్చారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు గనగళ్లవానిపేట సముద్ర తీరానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి రాజ్యలక్ష్మిగా గుర్తించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆమె కుమార్తె కుసుమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం.. కేసు నమోదు

నందిగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మర్లపాడు గ్రామానికి చెందిన కొత్తపల్లి ఆదెమ్మ(61) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ తెలిపారు. ఆదెమ్మ ఈనెల 24న మధ్యాహ్నం సామగ్రి కొంటానని చెప్పి హూండీ వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతికారు. బుధవారం ఉదయానికి కూడా ఆదెమ్మ జాడ తెలియకపోవడంతో కుమారుడు జనార్దనరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఆమెకు మతిస్థిమితం లేకపోవడంతో మెంటల్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ



పలాస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ-అక్కుపల్లి రహదారం తాళభద్ర రైల్వే గేటుకు సమీపంలో బుధవారం ఓ లారీ బురదలో కూరుకుపోయి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో గంటకు పైగా ట్రాఫిక్‌లో బస్సులు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. గంట పాటు శ్రమించి అతికష్టంపై లారీని బయటకు తీయడంతో అంతా ఊపిరి పిల్చుకున్నారు. కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి రూటులో లారీ లగేజితో వెళ్తోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రోడ్డు కిందకు వెళ్లి బురదలో కూరుకుపోయింది.

2న సత్సంగ సమావేశం

కోటబొమ్మాళి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఊడికల పాడు రామమందిర ప్రాంగణంలో వచ్చే నెల 2న సత్సంగ సమావేశం నిర్వహించనున్నట్టు ఆ గ్రామ రామకృష్ణ రమణ కరుణ గీతాశ్రమానికి చెందిన ప్రవచనకారుడు సనపల కరుణ్‌కుమార్ బుధవారం తెలిపారు. పొందూరు మండలం కృష్ణాపురానికి చెందిన సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి, పాతపట్నానికి చెందిన ప్రవచనకారులు తూలుగు తిరుపతిరావు, ఒడిశాకు చెందిన ప్రవచనకారులు అల్యాన వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఆందోళనలో అన్నదాత

- భారీ వర్షాలతో గండ్లు
- నీట మునిగిన వరి పంట
- నేలకొరిగిన జీడి, కొబ్బరి చెట్లు

మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు పొలాల గట్లు కోతకు గురై.. పలు కాలువలకు గండ్లు పడ్డాయి. దీంతో ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చేతికందే సమయంలో నీటమునగడంతో అన్నదాత తీవ్ర నష్టాలకు గురయ్యారు. పలు చోట్ల పొలాలు ఇసుకమేటలు వేసి కోతకు వచ్చిన వరిచేను మట్టి దిబ్బలగా మారింది. గట్లు కొట్టుకుపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


హరిపురం: హంసరాళి వద్ద సునాముది కాలువకు పడిన గండి

హరిపురం, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): మందస మండలంలో కుంటికోట, మఖరజోల, ఉమాగిరి, జీఆర్ పురం, పితాతోళి, హంసరాళి, బుడార్సింగి, చీపి, కొత్తపల్లి, వీవీఆర్ పురం, బిన్నల వంటి పలు గ్రామాల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొంది. మండల పరిధిలో మహేంద్రతనయ నది, సునాముది ఛానల్, డబార్సింగి, కళింగదల్, దామోదర సాగర్ తదితర ప్రధాన నీటివనరులతోపాటు సంకుజోడి, గోపాలసాగర్, నక్కాసాయి వంటి చిన్నతరహా వనరులు సైతం నీటి ప్రవాహ ఉధృతితో ప్రమాదకర స్థాయిలో నీరు ప్రవహిస్తుండడంతో పలు కాలువలకు గండ్లు పడ్డాయి. సంకుజోడి ఛానల్స్‌లో సుమారు పది చోట్ల గండ్లు పడి పొలాలన్నీ నీట మునిగాయి. సుమారు 22వేల ఎకరాల్లో పంట నీటిమునిగి తీవ్ర నష్టం జరిగింది. ఉద్దానం, ఏజెన్సీ ప్రాంతాల్లో జీడి కొబ్బరి చెట్లు నేలకొరిగాయి.

రోడ్లన్నీ జలయమం


పూండిగల్లీ ఆర్అండ్‌బీ రోడ్డుపై వరదనీరు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రహదారులు జలమయం కావడంతో ప్రజలు రాకపోకలతో ఇబ్బందిపడ్డారు. శివరాంపురం గ్రామం రహదారి జలమయం కావడంతో ప్రజలు ట్రాక్టర్ సాయంతో రాకపోకలు సాగించారు. పూండిగల్లీ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుపై నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నువ్వలరేవు చుట్టూ ఉన్న ఉప్పుటేరులో వరద నీరు చేరడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

కూలిన చెట్టు

నందిగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కవిటిఅగ్రహారం పెద్దవీధిలో గోడకూలి నిరాశ్రయులైన దారపు రాజేశ్వరి, బంగారి సీతారామయ్యలకు వీఆర్వో సీహెచ్ తులసీరావు బుధవారం భోజనాలతో పాటు రేషన్ సరుకులు అందించారు. స్థానిక డీలర్ బడే దమయంతి ద్వారా బియ్యం, పంచదార తదితర వస్తువులు అందజేశారు. ఇదిలా ఉండగా నందిగాం పెరటివీధిలో కాముచెట్టు పశువుల చావిడిపై పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

● మందస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో గత మూడురోజులుగా కురిసిన వర్షాలకు ఐదు ఇళ్లకు నష్టం వాటిల్లిందని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలి పారు. వీటి నాలుగు పాక్షికంగా, ఒకటి పూర్తిగా పాడైందన్నారు. బేతాళపురంలో 55 జీడి చెట్లకు నష్టం వాటిల్లింద తెలిపారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

పలాస/రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వరద ప్రాంతంలో బుధవారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వెంకన్నచౌదిరి విలేకరులతో మాట్లాడుతూ.. నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం


కేదారిపురం వద్ద టీడీపీ సమన్వయకర్త వెంకన్నచౌదరి..

అన్నివిధాలుగా ఆదుకుంటుందన్నారు. వరదలో కొట్టుకుపోయిన సవర లావణ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, కొర్ల విష్ణు ఉన్నారు. రెంటికోట పరిసర ప్రాంతాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఏడీ రామారావు ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. అలాగే నీటమునిగిన పంట పొలాలను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు బుధవారం పరిశీలించారు.

తంపర పొలాలు పరిశీలన

పోలాకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సుసరాం, దండులక్ష్మీపురం వరకూ ఉన్న తంపర ముంపు పొలాలను బుధవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరిశీలించారు. ఆయన వెంట బగ్గు అర్చన, భైరి భాస్కరరావు,


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఎంవీ నాయుడు, వ్యవసాయాధికారులు ఉన్నారు. ● అలాగే వేటకు వెళ్లని మత్స్యకారులు ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేకాధికారి వెంకటమధు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. బుధవారం వారు తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో వారు పర్యటించి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా రాజారాంపురం, మబగాంగ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు.

కాజ్‌వే పరిశీలన

పాతపట్నం, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భరోసా ఇచ్చారు. స్థానిక కాజ్‌వేపై మహేంద్రతనయ నదీ జలాలు ప్రవాహంతో కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలచిపోయిన నేపథ్యంలో ఆ కాజ్‌వేను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించారు. ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, ఏవో కె.సింహాచలం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ముంపు ప్రాంతాలను మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకర్ పర్యవేక్షణలో తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి తదతరులు లోతట్టు ప్రాంతాలైన సరాళి, చంగుడి గ్రామాల్లో పర్యటించారు. చాకిపల్లి సమీపంలో గుమ్మగెడ్డకు గండి పడింది. దీంతో చాకిపల్లి, ఏఎస్‌కవిటి, ఆర్ఎల్ పురం, పాశిగంగుపేట పంచాయతీల పరిధిలో సుమారు 100 ఎకరాల వరకూ ముంపునకు గురైంది. అలాగే పొగడవిల్లి గెడ్డకు ఏర్పడిన చిన్నపాటి గండికి పెద్దలోగిడి, చిన్నలోగిడి, బోరుభద్ర, బి.గోపాలపురం, కన్నయ్యపేట బొమ్మిక పరిధిలో సుమారు 200 ఎకరాలు నీట మునిగాయి. బొమ్మికచేరువలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద స్ట్రక్చర్ తోపాటు పలు సమస్యలు ఏర్పడగా ఏడీఈ ప్రసాదరావు పర్యవేక్షణలో మరమ్మతులు చేపట్టారు.


పొగడవిల్లి గెడ్డకు పడినగండి

బాధితులను ఆదుకుంటాం: ఎంజీఆర్


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. బుధవారం మధనాపురం పంచాయతీ ఆర్‌కే పురం పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించి బాధితులతో మాట్లాడారు. వారికి నిత్యావసర సరుకులతోపాటు ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున్న అందజేశారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపీడీవో బీవీ రాంప్రసాద్‌రావు, టీడీపీ నాయులు పాల్గొన్నారు. ● తుఫాన్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె నీలకంఠాపురం గ్రామ పరిధిలో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు.

● హిరమండలం: ఎం.అవలంగి, కల్లట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పరిశీలించారు. పునరావాసకేంద్రంలో ఉన్న 11 కుటుంబాలకు రూ.3వేలు ఆర్థిక సాయాన్ని నిత్యావసర సరుకులు అందజేశారు. తహసీల్దార్ జోగారావు, మండల టీడీపీ అధ్యక్షుడు దారపు ఢిల్లేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

చెబుతున్నా వినట్లే..


అధికారులు వద్దన్నా ప్రమాదకర స్థితిలో వెళ్తున్న ఓ వ్యక్తి

పలాస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కంబిరిగాం గ్రామం వద్ద వరహాలుగెడ్డ బుధవారం ఉగ్రరూపం దాల్చింది. రోడ్డుకు మూడు అగుగుల మేర నీరు ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిపివేశారు. ఇదిలా ఉండగా బుధవారం ఓ వ్యక్తి ప్రవాహంలో కొట్టుకు పోగా.. మరొక వ్యక్తి ఆ మార్గం గుండా వెళ్లే ప్రయత్నం చేశాడు. అప్పటికే ఆ వ్యక్తి తప్పతాగి ఉండడంతో డిప్యూటీ తహసీల్దార్ వి.గిరి, పోలీసులు ఆయన్ను నిలువరించారు. అయితే కాసేపటి తర్వాత వారి కన్నుగప్పి నీటి ప్రవాహంలో వేగంగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. అటువైపునకు క్షేమంగా చేరుకున్నా.. ఏ మాత్రం అదుపుతప్పినా ఆ వ్యక్తి కొట్టుకుపోయేవాడని అక్కడివారు అభిప్రాయపడ్డారు.

368 ఎకరాల్లో పంట నష్టం


రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): మండలంలో 368 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. దీనితో పాటు సుమారు ఎనిదిళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. పరశరాపురం పంచాయతీ నందవ గ్రామాల్లో గిరిజనులకు పునరావాసం కల్పించారు. వ్యవసాయాధికారులు బందపల్లి, మర్రిపాడు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. పెద్దలక్ష్మీపురం గ్రామంలో ఇళ్లు పడిపోయిన వారికి టీడీపీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు, జాడుపల్లి ఎంపీటీసీ బి.లలిత, సుజాత రాజులు రేషన్ సరుకులు అందజేశారు.

ఉధృతంగా కాలువలు


కిల్లాం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువ

నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బాలసీమ వద్ద నూకలమ్మ గెడ్డ, కోమర్తి వద్ద కిల్లాం చానల్, నడగాం వద్ద ఓపెన్‌హెడ్ చానల్స్‌లో వరదనీరు చేరడంతో పొంగి ప్రవహిస్తుంది. దీంతో కాలువలకు గండ్లు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ● నరసన్నపేట వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోగల నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సారవకోట మండలాల్లో సుమారు 3వేలు హెక్టార్లలో వరిపంట నేలకొరిగింది. దీంతో పొలాల్లో ఉన్న వరదనీటిన మళ్లించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. తిండి గింజలను దక్కించుకునేందుకు పడే వరి పైరును కట్టలు కట్టి.. నీరు నిల్వలేకుండా పొలాల్లో వరదనీటిని మళ్లిస్తున్నారు. చిన్నదూగాం, టెక్కలిపాడు, జమ్ము, కిల్లాం, ఈదులవలస, రావులవలస, ఉర్లాం, చేనులవలస, సుందరాపురం, పారశెల్లి, మాకివలస, కోమర్తి, మడపాం, కంబకాయి, కరవంజి, కూర్మనాథపురం, పారశెల్లి, లుకలాం, చెన్నాపురం, చోడవరం తదితర గ్రామాల్లో వరిపైరు నేలకొరిగింది.

హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి నిధులు

జలుమూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. తుఫాన్ ప్రభావంతో కూలిపోయిన హాస్టల్ ప్రవహరీని బుధవారం ఆయన పరిశీలించారు. బాలికల వసతి గృహానికి ప్రహరీ అత్యవసరమన్నారు. బాలికల సంరక్షణ కోసం త్వరితగతిన పనులు చేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగ్గు అర్చన, రాజేంద్రనాయుడు, దుంగ స్వామిబాబు, తర్ర బలరాం తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిశీలన

జలుమూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం వలన కురిసిన వర్షాలకు నష్టపోయిన వరిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రాథమిక అంచనాలు రూపొందిస్తున్నట్లు తహసీల్దార్ జె.రామారావు, వ్యవసాయాధికారి కె.రవికుమార్ తెలిపారు. లింగాలవలస వద్ద బుధవారం నష్టం జరిగిన వరి పొలాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. మండలంలో గల 17 గ్రామాల్లో గల వరిచేలను క్షేత్రస్థాయిలో పరిశీలించి 310 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించామన్నారు.

ఆమోదం పొందినా టెండర్లు పిలవలేదేమి?

పలాస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు పరిపాలన ఆమోదం తీసుకున్నా ఎందుకు టెండర్లకు పిలవలేదని సినియర్ టీడీపీ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ అధికారులను ప్రశ్నించారు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మున్సిపల్ సమావేశం బుధవారం జరిగింది. సూర్యనారాయణ మాట్లాడుతూ మొత్తం 32 పనులు చేసేందుకు ఆమోదం తీసుకున్నారని, ఇప్పటి వరకూ టెండర్లు పిలవకపోడంలో ఆంతర్యమేంటన్నారు. మున్సిపాలిటీకి కొత్తగా రూ.35 లక్షల నిధులు విడుదలయ్యావని, ప్రతివార్డులో పారిశుధ్యం పనులకు నిధులు వెచ్చించడంతో పాటు పనులను మెప్మా సిబ్బందికి అప్పగించడం జరుగుతుందని కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. వైస్‌చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పాతపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాత పట్నంలో రక్షిత నీటిసరఫరాలో గురువారం అంతరాయం ఏర్పడనుందని ఈవో ఊన రామచంద్రరావు తెలిపారు. తుఫాన్ కారణంగా గత మూడురోజులుగా కురసిన వర్షాలకు రక్షిత నీటి పథకం బావి, బోర్లు మహేంద్రతనయ నదీ ప్రవాహంలో మునిగిపోయాయన్నారు. దీంతో అంతరాయం ఏర్పడినట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

జలజీవన్ ద్వారా తాగునీరు అందిస్తాం

పోలాకి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జలజీవన్ పథకం ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తామని ప్రజలు ఆందోళన చెందవద్దని గ్రామీణ నీటి విభాగ డీఈ జే.సుదర్శనరావు తెలిపారు. బుధవారం ఆయన గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పథకాల పనితీరును పరిశీలించారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల పరిధిలో సుమారు 100 గ్రామాలకు జలజీవన్ పథకం ద్వారా తాగునీటి పథకం అమలుచేశామన్నారు. వనితమండలం తాగునీటి పథకం ద్వారా పోలాకి మండలంలో సుమారు 45 గ్రామాల్లో నీరు సరపరాచేస్తున్నామన్నారు.

నీలమణిదుర్గ ఆదాయం రూ.8.20లక్షలు


హుండీలు లెక్కిస్తున్న దృశ్యం

పాతపట్నం, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): స్థానిక శ్రీనీల మణి దుర్గ ఆలయానికి 44 రోజులకు గానూ రూ.8,20,372 ఆదాయం లభించినట్టు ఈవో టి.వాసుదేవ రావు తెలిపారు. ఆలయంలో హుండీలను దేవదాయశాఖ సహాయ కమిషనర్, కార్యాలయప్రతినిధి టెక్కలి దేవలయాల కార్యనిర్వాహణాధికారి టీపీ మనస్విని పర్యవేక్షణలో బుధవారం లెక్కించారు. కార్యక్రమంలో ధర్మ కర్తలమండలి అధ్యక్షుడు అక్కంద్ర సన్యాసిరావు, మండలిసభ్యులు వెంటకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు పరిహారం అందజేత

సంతబొమ్మాళి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలం మలగాం గ్రామ పంచాయతీలో మొంథా తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.3వేలు చొప్పున్న ఆర్థిక సహాయం బుధవారం సాయంత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బుచ్చ మురళి కృష్ణ, రట్టి పెరుమాలు, స్థానిక నాయకులు, మండల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

పాతపట్నం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖాగ్రంథాలయంలో రొంపివలస జడ్పీహైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు బంటుపల్లి వెంకట రమణ రచించిన మై లిటిల్ వరల్డ్ ఆఫ్ క్వశ్చన్స్ అనే ఆంగ్లపుస్తకాన్ని డీఈవో రవిబాబు బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. జిల్లా సైన్స్ అధికారి నల్లకుమారస్వామి అధక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులు ప్రముఖులు పాల్గొన్నారు.

ఉధృతంగా వంశధార



హిరమండలం, అక్టోబరు 29(ఆంధ్ర జ్యోతి): గొట్టా బ్యారేజీ వద్ద వంశధార ఉధృతంగా ప్రవహిస్తుంది. తుఫాన్ ప్రభావంతో నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నదిలో వరద నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం సాయంత్రం నాటికి 21 గేట్లు కాస్త పైకెత్తి 38,138 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెట్టారు. వరద ఉధృతి క్రమేపీ తగ్గుతున్నట్లు గొట్టాబ్యారేజీ డీఈ సరస్వతి చెప్పారు. ఒరిశా క్యాచ్‌మెం ట్ ఏరియాల్లో 269.60 మి.మీల వర్షపాతం నమోదయింది.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

హిరమండలం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నీట మునిగిన పంటలను వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన నష్టాన్ని కొంతమేర నివారించవచ్చని ఏవో సంధ్య అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాల కారణంగా నేలకొరిగిన, నీట మునిగిన వరి పంటను ఆమె పరిశీలించారు. పంటలు కాపాడుకునేందుకు రైతులకు పలు సూచనలు చేశారు.

● నందిగాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో నేలకొరిగిన పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.మధుకుమార్, బి.స్వాతిలు బుధవారం పరిశీలించారు. టెక్కలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు, ఏవోపి.శ్రీకాంత్‌వర్మలతో కలిసి రాంపురం, లక్ష్మీపురం, పెద్దతామరాపల్లి, కర్లపూడి, కోమటూరు తదితర గ్రామాలను సందర్శించి పంటల పరిస్థితిపై ఆరాతీశారు. అనంతర పలు సూచనలు చేశారు.

● నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరిలో పాముపొడ, ఆకుఎండు, మానిపండు తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని ఏవో సూర్యప్రభ అన్నారు. బుధవారం సత్యవరంలో వరిపైరులను పరిశీలించారు. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే పైమెట్రోజైన్ లేదా డైనేటోఫ్యూరాన్ మందును పిచికారి చేయాలని సూచించారు. పొలాల్లో నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

● కోటబొమ్మాళి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వివిధ దశల్లో ఉన్న వరి పంటకు శాస్త్రీయ పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవాలని ఏవో ఎస్.గోవిందరావు అన్నారు. బుధవారం ఆయన కొత్తపల్లి, కురుడు, దంత తదితర గ్రామాల్లో నేలకొరిగిన వరి పంట పొలాలను పరిశీలంచారు. గింజ గట్టిపడే దశలో ఉన్న వెన్ను బరువు వల్ల కొద్దిపాటి గాలి, వర్షానికే విరిగి నేలను తాకిందన్నారు. వీటిని నిలబెట్టి కట్టలుగా కట్టుకుంటే రక్షించుకోవచ్చన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నరసన్నపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్ అంధకారం అయిందని అందుకు ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘ నాయకులు కరిమి రాజేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. డీఏ బకాయిలకు తమకు చెల్లించాలన్నారు. ఈకార్యాక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షులు చల్ల సింహాచలం, యాళ్ల శ్యామ్‌సుందర్, చింతు వాసుదేవరావు, దంత బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.